www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 ఫిబ్రవరి 2025
5
తిరుపతి



రేపు చంద్రబాబు తిరుపతికి రాక

ప్రజాశక్తి - రేణిగుంట

ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 23 తేదీన ఆదివారం తూకివాకం సమీపంలోని ఆర్‌బిఆర్ కళ్యాణ మండపంలో జరుగనున్న నరసింహ యాదవ్ కుమారుడి వివాహ వేడుకకు హాజరు కానున్నారు. పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎస్పి సంయుక్తంగా అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నందు సిఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. చంద్రబాబునాయుడు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తూకివాకం సమీపంలోని ఆర్బిఆర్ కళ్యాణ మండపంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూ వరులను ఆశీర్వదించి తిరుగుప్రయాణం కానున్నారు.ముందస్తు భద్రత ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అదనపు ఎస్పి లు రవి మనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్టీఓ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

'శ్రమకావ్యం' గానానికి ఫిదా'


'శ్రమే' జగతికి 'మూలం' : సుద్దాల అశోక్‌తేజ, సిహెచ్ నర్సింగరావు





ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సుద్దాల అశోక్‌తేజ రచించి గానం చేసిన 'శ్రమకావ్యం' గానానికి ఆహుతులు 'ఫిదా' అయ్యారు. శ్రమ జగతికి మూలమని, కష్టానికి తగ్గ విలువ రావాలని వక్తలు శ్రమకావ్యం గాన సభలో ఉద్ఘాటించారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజచే శ్రమ కావ్యం గానం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి మల్లారపు నాగార్జున అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ 2016లో 'శ్రమకావ్యం' రాశానని, దానికి బీజం అంతకు పది సంవత్సరాలకు ముందే పుట్టిందన్నారు. తాను ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో భవన నిర్మాణ మేస్త్రి వద్ద అసిస్టెంట్ గా పని చేశానని, శని ఆదివారాల్లో కూలి పనులకు వెళ్లి వచ్చే డబ్బుతో చదువుకున్నానని తెలిపారు. అప్పుడే తనకు శ్రమ గొప్పతనం తెలిసిందని, అప్పట్నుంచి శ్రమజీవులపై పాటలు, కవితలు రాస్తూనే ఉన్నానన్నారు. ప్రేమపై ఇప్పటివరకు సినీ గేయాలలో 10 వేల పాటలు వచ్చి ఉంటాయని, ప్రేమ జీవితంలో ఒక భాగం అని, జీవితంలో గొప్పది శ్రమని అన్నారు. భూమి పుట్టినప్పటినుంచి ఎన్ని చెమట చుక్కలు భూమిపై రాలి ఉంటాయో, వాటన్నిటికీ లెక్కలు కడితే, శ్రమపై ఎన్ని లక్షల కోట్లు పాటలు రావాలని అన్నారు. ఆ ఆలోచనే తన కావ్యానికి పునాది వేసిందని తెలిపారు. అనంతరం తన గానం ద్వారా తానే రచించిన శ్రమ కావ్యాన్ని గానం చేసి, ప్రేక్షకులను అలరింపజేశారు, ఆలోచింపజేశారు. మరో ముఖ్య అతిథి సిపిఐఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో మొదటిసారిగా శ్రమ కావ్యం గానం ఏర్పాటు చేశామన్నారు. అప్పటినుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటివరకు 57 కావ్య గానాలు జరిగాయని తెలిపారు. శ్రమ జగతికి మూలమని, ఇది జగమెరిగిన సత్యం అన్నారు. కానీ మన పాలకులు ఆదాని అంబానీలే మూలం అనేలా వ్యవహరిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రమజీవులైన కార్మికుల గురించి నేటి పాలకులు మాట్లాడకపోవడాన్ని అందరూ గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. సీపీఐఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ఫిబ్రవరి 21వ తేదీ ప్రపంచ మాతృభాష దినోత్సవమే కాదు, 176 సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు ప్రణాళికలు విడుదలైన రోజు అని గుర్తు చేశారు. కార్మిక వర్గానికి ఆయుధాన్ని అందించిన రోజన్నారు. ఆధ్యాత్మికతను అడ్డం పెట్టుకుని లక్షల కోట్ల రూపాయలు సంపాదించుకునేందుకే పాలకులు చూస్తున్నారని, అందులో భాగంగానే మూడు రోజుల క్రితం తిరుపతి కేంద్రంగా జరిగిన ఇంటర్నేషనల్ టెంపుల్ అని గుర్తు చేశారు. ఇందులో ఆదాయంపై చర్చ జరిగిందని, ఆధ్యాత్మికతను అడ్డుపెట్టుకుని కార్పొరేట్ శక్తులకు కోట్లాది రూపాయలు ఎలా దోచి పెట్టాలి అనే తీరున జరిగిందన్నారు. ఇలాంటి తరుణంలో శ్రమను గుర్తిస్తూ సుద్దాల అశోక తేజ రచించిన శ్రమ కావ్య గానాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షులు మల్లారపు నాగార్జున మాట్లాడుతూ 58వ శ్రమ కావ్య గానాన్ని తిరుపతిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. సమాజ పరిణామక్రమాన్ని అనుభవపూర్వకంగా అధ్యయనం చేసి సుద్దాల అశోక్ తేజ రచించారన్నారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం గౌరవ అధ్యక్షులు బెంకాయల దామోదరం, సుద్దాల అశోక్ తేజ సతీమణి నిర్మల పాల్గొన్నారు.



'రెడ్‌బుక్ డే' ప్రాముఖ్యతను వివరిస్తున్న ఎ.పుల్లయ్య

కమ్యూనిజమే మానవాళి మార్పుకు నాంది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ప్రపంచ మానవ చరిత్రలో కారల్ మార్క్స్, ఎంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక సమాజ పెను మార్పుకు నాంది పలికిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో 'రాజ్యం-విప్లవం' పుస్తకంపై జరిగిన రెడ్ బుక్ డే సదస్సులో పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రని అందరూ చదివారని, కానీ కమ్యూనిస్టు ప్రణాళిక మాత్రం ఈ ప్రపంచాన్ని మార్చాలని ఉద్బోధించిందన్నారు. దీని ప్రేరణతో మనిషిని మనిషి దోపిడీ చేసే విధానానికి ప్రత్యామ్నాయంగా అందరూ సమానమేనన్న సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆటవిక సమాజం, బానిస సమాజం, భూస్వామ్య సమాజం, పెట్టుబడి దారీ సమాజం, సామ్రాజ్యవాద నియంతృత్వం వంటి అంశాలను అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. కమ్యూనిస్టు ప్రణాళిక ఇచ్చినటువంటి స్ఫూర్తితో ప్రతి కార్యకర్త దోపిడీకి తావులేని సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ సదస్సులో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, దాసరి జనార్ధన్, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసమా... రాజీనామానా..!

కార్పొరేషన్‌లో పాగాకు 'కూటమి' యత్నం
వైసిపి మేయర్ శిరీషపైనా తీవ్ర ఒత్తిడి
మార్చి 18 నాటికి నాలుగేళ్లు పూర్తి
కూటమి అభ్యర్థి 'అన్న' కుటుంబానికేనా..!



మేయర్ డాక్టర్ శిరీష


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

డిప్యూటీ మేయర్‌ను కూటమి చేజిక్కించుకున్న తరువాత జరిగిన తొలి కౌన్సిల్ సమావేశంలోనే మేయర్ డాక్టర్ శిరీష వాకౌట్ చేయడం, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ తాత్కాలిక మేయర్‌గా సమావేశాన్ని నిర్వహించడం చూసేశాం.. ఇదే 'కూటమి' ప్రభుత్వ పక్కా ప్లాన్.. తిరుపతి కార్పొరేషన్‌లో కూటమి జెండా ఎగరాలంటే మేయర్ పదవిని చేజిక్కించుకోవాలి. మార్చి 18 నాటికి నాలుగేళు పూర్తి కావస్తున్న నేపథ్యంలో మెజార్టీ చూపించుకుని మేయర్ పదవికి అవిశ్వాసం పెడతారా? లేక కూటమి ఒత్తిడి తట్టుకోలేక శిరీష రాజీనామా చేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. కూటమిలోనూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి 'అన్న' కుటుంబం మేయర్ పదవి కోసం తీవ్ర ప్రయత్నం చేస్తోంది.

కార్పొరేషన్‌లో టిడిపి జెండా ఎగరవేయాలని కూటమి పావులు కదుపుతోంది. ఫిబ్రవరిలో డిప్యూటీ మేయర్‌గా ఆర్‌సి మునికృష్ణను ఎలా గెలిపించుకున్నామో, అలాగే మేయర్‌ను చేజిక్కించుకోవాలన్నది వారి వ్యూహం. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసిపి కార్పొరేటర్లతో బలవంతంగా ఆర్‌సి మునికృష్ణకు ఓటు వేసేలా చేశారు. దీంతో వైసిపి బలం ఎంత అనేది స్పష్టమయ్యింది. దీంతో ఆమె దిగిపోవాలని, లేదంటే అవిశ్వాసం పెట్టి దింపేస్తామని మౌఖిక ఆదేశాలు వెళ్లాయని సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. వైసిపి అధికారంలో ఉన్నపుడు పదవుల కోసం అడ్డదారి తొక్కిందని, దానినుంచి ఉపశమనం కల్పించడానికి కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. మేయర్, డిప్యూటీ మేయర్ రెండున్నర సంవత్సరాల నుంచి నాలుగేళ్లలోపు అవిశ్వాస తీర్మానం పెట్టవచ్చుని బిల్లులో పేర్కొంది. ఈ బిల్లు క్యాబినెట్‌లో ఆమోదం తెలిపింది. అసెంబ్లీ సమావేశాల్లోనూ తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలోనే మేయర్ అవిశ్వాస తీర్మానం చర్చ ముందుకొచ్చింది. వైసిపి కార్పొరేటర్లు కొంతమంది తమ ఆస్తులను భద్రపరచుకోడానికి, కూటమి దాడుల నుంచి తప్పించుకోడానికి టిడిపి, జనసేన పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. తాజాగా జరిగిన కౌన్సిల్లోనూ తనకు సరైన గుర్తింపు లేదని మేయర్ డాక్టర్ శిరీష వాకౌట్ చేయడంతో, ఆమెతో పాటు 15 మంది వైసిపి కార్పొరేటర్లు వాకౌట్ చేశారు. దీన్నిబట్టి చూస్తే వైసిపికి బలం తగ్గడమే కాకుండా, కూటమి బలం పెరిగిందని చెప్పవచ్చు.

'అన్న' కుటుంబానికేనా మేయర్ పదవి?

తిరుపతి బిసి సామాజికవర్గానికి చెందిన అన్న రామచంద్రయ్య కుమార్తెలైన అన్న అనితయాదవ్, అన్న సంధ్యాయాదవ్ 48, 49 డివిజన్ల కార్పొరేటర్లుగా వ్యవహరిస్తున్నారు. 2021లో జరిగిన ఎన్నికల్లో మేయర్ పదవిని ఆశించి భంగపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రామచంద్రయ్య కుమార్తెలు ఇద్దరూ కూటమి పార్టీలో చేరిపోయారు. పార్టీలో చేరే ముందే మేయర్ పదవి కండిషన్‌తో చేరినట్లు సమాచారం. అయితే టిడిపి, జనసేన అధినేతలు వైసిపి కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. తిరుపతిలో వైసిపి నుంచి వలసలు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నా అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే జనసేన పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ తనకు మేయర్ పదవి ఇవ్వాలని ఆ పార్టీ అధిష్టానానికి లేఖ రాశారు. తుది నిర్ణయం అధినేతలదే. ఇటీవల తాజాగా నారా లోకేష్ తిరుపతి కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈనెల 23న జరగనున్న నరసింహయాదవ్ కుమారుని వివాహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరు కానున్నారు. ఈ సందర్భంగానూ మేయర్ పదవిపై డైరెక్షన్ ఇచ్చే అవకాశం లేకపోలేదు.



చంద్రబాబుతో 'అన్న' వారసురాలు

'టైం ఆఫ్ డే' రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ


విద్యుత్ ఛార్జీలు పెంచలేదని ఏపీఈఆర్సి చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ చేసిన ప్రకటన సత్య దూరమైందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలను ఎడా పెడా పెంచేస్తూ వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. 2025- 26వ సంవత్సరానికి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ డిస్కములు సమర్పించిన ప్రతిపాదనలను అంగీకరించటం దారుణమైందని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెరగలేదని ఏపీఈఆర్సీ తరఫున చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ ప్రకటించారని పేపరు మీద పెరుగుదల లేదని చెబుతూనే, టైం ఆఫ్ డే అనే కొత్త విధానాన్ని తీసుకొని వచ్చారని పీక్ అవర్స్ లో విద్యుత్తు వాడుకునే వారు అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని, ఇప్పటివరకు పారిశ్రామిక అవసరాలకు ఈ విధానం ఉండేదని, ఇప్పుడు వాణిజ్య కనెక్షన్లు పై కూడా దీనిని వర్తింపజేశారని, రానున్న రోజుల్లో గృహ అవసరాల వినియోగానికి కూడా ఈ విధానాన్ని వర్తింప చేస్తారని ఆయన ఆరోపించారు. పీకవర్స్ లో విద్యుత్తు వినియోగం కారణంగా యూనిట్ కు 50 పైసల నుంచి రూపాయి వరకు పెరగడానికి అవకాశం ఉందని, వాణిజ్య కార్యకలాపాలపై విద్యుత్తు భారం పెంచడం వల్ల తిరిగి ప్రజల పైనా, వినియోగదారుల పైన ఆ భారం పడుతుందని పేర్కొన్నారు.

రేపు విశ్వంలో ఉచిత సైనిక్-2025 మోడల్ ఎంట్రన్స్ టెస్ట్

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతి స్థానిక వరదరాజ నగర్ లోని విశ్వం విద్యా సంస్థలలో ఈ నెల 23వ తారీఖున ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత సైనిక్ మోడల్ టెస్ట్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి తెలిపారు. 6, 9వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించు ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహించబడుతుందని వివరించారు. ఈ నమూనా పరీక్షకు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాల కోసం 8688888802 / 03, 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

టీటీడీ బోర్డు సభ్యులు నరేష్ కుమార్ క్షమాపణ



ఈవో సమక్షంలో ఉద్యోగికి క్షమాపణ చెబుతున్న నరేష్‌కుమార్

ప్రజాశక్తి - తిరుమల టిటిడి బోర్డు సభ్యులు నరేష్‌కుమార్ క్షమాపణ చెప్పడంతో తాము ఆందోళనను విరమిస్తున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు వెల్లడించాయి. టీటీడీ ఉద్యోగి బాలాజీపై నరేష్ కుమార్ అనుచితంగా ప్రవర్తించిన తీరు, ఇటీవల వరుసగా జరిగిన సస్పెన్షన్లు, బదిలీలకు నిరసనగా రెండు రోజులుగా ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టిన విషయం విదితమే. గురు, శుక్రవారాల్లో ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, శాంతరామ్ తదితరుల సమక్షంలో చర్చలు సుదీర్ఘంగా జరిగాయి. అనంతరం పాలకమండలి సభ్యులు నరేష్‌కుమార్ బేషరతుగా టిటిడి ఈవో, అడిషనల్ ఈవో, ఉద్యోగ సంఘాల సమక్షంలో ఉద్యోగి బాలాజీకి క్షమాపణ చెప్పారు. ఇటీవల జరిగిన అనవసర సస్పెన్షన్లు, బదిలీలను రద్దు చేసి యధాస్థానంలో నియమించాలని, పెండింగ్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఉద్యోగ సంఘాల మధ్య మరింత సమన్వయం పెంచుకుని ఐక్యంగా ప్రధాన సమస్యలపై పని చేయాలని తీర్మానిస్తూ, ఆందోళనను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటి

తిరుపతి రాజీవ్ నగర్, పి.వి. నగర్, ముని రెడ్డి నగర్, పద్మావతి హాస్టల్, గాయత్రీ నగర్, శ్రీ కష్ణ నగర్, గాంధీపురం, శ్రీ రాజ కాలని , పద్మావతి కాలేజీ మహిళా యూనివర్సిటీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇఇ విన్నకోటి చంద్రశేఖర్‌రావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఉచిత గ్యాస్‌కు అధిక బిల్లు వసూలు చేయొద్దు : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఉచిత గ్యాస్ సిలిండర్ సరఫరా (దీపం -2) డెలివరీ చేసినపుడు వినియోగదారుల నుండి బిల్ ధర కన్నా ఎక్కువ వసూలు చేయకూడదనీ, వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ గ్యాస్ సిలిండర్ ఏజెన్సీలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరము నందు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పౌర సరఫరాల అధికారి శేషాచలం రాజు, గ్యాస్ సిలిండర్ ఏజెన్సీలతో కలిసి ఉచిత గ్యాస్ సిలిండర్ (దీపం 2) పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏదైనా పిర్యాదులు వచ్చినచో గ్యాస్ ఏజెన్సీ బి.ఫాం లైసెన్స్ లను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ జయరాజ్ పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, స్వచ్ఛ సర్వేక్షణలో తిరుపతి ఉత్తమ ర్యాంకును సాధించేందుకు కషి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అభివద్ధి పనులు, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, స్వచ్ఛ సర్వేక్షన్, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అన్ని విభాగాల అధికారులు, ఆన్లైన్ ద్వారా సచివాలయ కార్యదర్శులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సర్వే లను సచివాలయ సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రోడ్ల పైన గుంతలను త్వరగా పూడ్చాలని అన్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వాటర్ ఫౌంటైన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. నగరంలో ఎక్కడా చెత్త కుప్పలు, చెత్త లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల్లో ఔట్‌సోర్సింగ్ వద్దు

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రభుత్వ బ్యాంకుల్లో ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి, రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, బ్యాంకుల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్బిఐ బ్యాంక్ వద్ద ధర్నా జరిగింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు స్థానిక రామానుజుల సర్కిల్ లో ఉన్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట యు ఎఫ్ బి యు కన్వీనర్ పి. విజయ బాస్కర్, టీబీఈసీసీ ప్రధాన కార్యదర్శి జే. ధన్వంత్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ఏడాది మార్చి 8 వ తేదీ ఐ బి ఏ యూనియన్ నాయకులతో ఒప్పందం ప్రకారం 15 రోజులలో తమ డిమాండ్లను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. బ్యాంకుల్లోని అన్ని క్యాడర్లలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు కల్పించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో మార్చి 24, 25 తేదీల్లో సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జనార్ధన్, భాస్కర్, కేశవరెడ్డి, సుమలతి, రేష్మ, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ కళాశాలలో 9 మంది వైద్యులు తొలగింపు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో పనిచేస్తున్న 9 మంది వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో వారిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 50 మంది ప్రభుత్వ వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలకు చెందిన ఎం. వెంకట రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్, వి.సరస్వతి. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్, బి.కిరణ్ కుమార్. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్, కె. మధురిమ నాయుడు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్, పి .నలిని. అసిస్టెంట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్, బి. చంద్రశేఖర్. అసిస్టెంట్ ప్రొఫెసర్ న్యూరాలజీ, కె .లావణ్య. అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్, ఏ. కార్తీక్. అసిస్టెంట్ ప్రొఫెసర్ రేడియో డయాగ్నసిస్, ఈ. శ్రీకాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కార్డియాలజీ ఎలాంటి అనుమతులు, సెలవు లేకుండా ఏడాదికి పైగా వైద్యులు విధులకు గైర్హాజరవుతున్నట్లు ఫిర్యాదులు. లోకాయుక్త ఆదేశాలతో వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది.

ఎస్వీఎంసిలో సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కేంద్ర ప్రభుత్వ సహకారంతో శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల, రుయా హాస్పిటల్ చిన్నపిల్లల విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు, ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాన్ని ఎస్ వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రికి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో నెలకొల్పామన్నారు. ఈ కేంద్రంలో చిన్నపిల్లలకు పుట్టుకతో వికలాంగులుగా పుట్టిన వారికి ఈ కేంద్రం నుండి కావాల్సిన వైద్య సహాయ సహకారాలు, వైద్యం ఎల్లప్పుడూ అందించడానికి, అవసరమైన వైద్య సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకష్ణ నాయక్, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఈ ప్రశాంత్(ఆర్ బిఎస్ కే), డాక్టర్ రాజన్ శుక్ల, డాక్టర్ సంతోష్ కుమార్ కర్లేటీ పాల్గొన్నారు.

అమ్మభాషకు అక్షరమవుదాం..!

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్, యంత్రాంగం

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల అధ్యక్షులు డాక్టర్ సి. భువనేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భాష మానవజాతి పెంపొందించుకున్న ఒక శక్తివంతమైన సాధనమని, భాష వ్యక్తుల ఆలోచనలు, భావాలను వ్యక్తీకరించడానికి తోడ్పడమే కాకుండా వారి మధ్య మైత్రిని, సాంస్కృతిక బంధాలను ఆర్థిక సంబంధాలను నెలకొల్పుతుందని, సమాజంలోని వ్యక్తులమధ్య భావ వినిమయానికి ఉపయోగపడుతుందని, మాతభాషను ప్రేమిస్తూ ఇతర భాషల్ని గౌరవించాలని వివరించారు. ముఖ్య అతిథి విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ డిఎమ్.ప్రేమావతి యునెస్కో బంగ్లా భాష ఉద్యమం మానవ భాషా సాంస్కృతిక హక్కులను పురస్కరించుకొని 1999 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం గా ప్రకటించిందని వివరించారు. విశిష్ట అతిథి విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ మీనాకుమారి మాట్లాడుతూ తెలుగు భాష సౌరభాన్ని మధురిమను పలు రచయితలు రచించిన పాటలను వివరించి, విద్యార్థినిలలో ఎంతో ఉత్తేజపరిచి వారిలో స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ జయమ్మ, కల్పన ధనమ్మ, మునేంద్ర, హాస్టల్ వార్డెన్ డా. స్నేహలత, ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ డా.శారద పాల్గొన్నారు. శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ డి.పరమేశ్వర, తెలుగు, ఇంగ్లీష్ అధ్యాపకులు కొండలరావు, చంద్రయ్య పాల్గొన్నారు.



- బుచ్చినాయుడు కండ్రిగలో.. కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో కవి, రచయిత, తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. అమ్మఒడి నుంచి నేర్చుకున్న మాతృభాష తెలుగుకు అక్షర రూపం ఇస్తూ భాషను భావితరాలకు వారసత్వంగా అందించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. యువశ్రీ మురళి మాట్లాడుతూ జాతి మనుగడకు భాషే ఆధారమని, మాతృమూర్తిని, మాతృభాషను మరువరాదన్నారు. విద్యార్థులకు బాలసాహిత్య కథలను బహుమతులుగా అందించారు. తెలుగుతల్లి వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బందం నాదెండ్ల మురళి, ఒబ్బు దేవిప్రసాద్, వేణుగోపాల్ ,లక్ష్మయ్య, దాసు, దేవేంద్ర పాల్గొన్నారు. జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాలను మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు కె.రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

పుత్తూరు టౌన్‌లో.. గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. జీవితంలో ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా అమ్మను, అమ్మభాషను మరచిపోరాదన్నారు. తెలుగు ఉపాధ్యాయులు నరసింహులు, ప్రభావతి ఆధ్వర్యంలో పిల్లలకు కథలు, పద్యాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

- గూడూరు టౌన్‌లో.. ఎసకెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాతృభాష శిశువు పెరుగుదలతో పాటు భావవ్యక్తీకరణకు, మానసిక వికాసానికి, దోహదపడుతుందని, మాతభాష యొక్క ప్రాముఖ్యతని గుర్తుపెట్టుకుని మాతృభాషా అభివృద్ధికి పాటుపడాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, డాక్టర్ కె. కోటేశ్వర రావు, ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. విజయ మహేష్ పాల్గొన్నారు.

– రామచంద్రాపురంలో.. చేకూరి నాగమనాయుడు, ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర భాషోద్యమ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మాతృభాషపై మమకారాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు విర్వనాథం, సుబ్రమణ్యం పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

శ్రీకాళహస్తిలో.. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాతృభాషా ఔన్నత్యాన్ని, విశిష్టతను విద్యార్థులకు విశదీకరించి చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ నరసింహ, ప్రొఫెసర్ రాజేంద్రుడు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నాయకులకు పదోన్నతులు



ప్రజాశక్తి - నాయుడుపేట: వైయస్సార్సీపీ అధిష్టానం రాష్ట్రవ్యాప్తంగా పార్టీలో పని చేస్తున్న సీనియర్ నాయకులకు పదోన్నతులు కల్పించింది. అందులో భాగంగా సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేటలో విజయ డైరీ డైరెక్టర్‌గా పనిచేసి ఉత్తమ సేవలందించిన మేనకూరుకు చెందిన సీనియర్ నాయకులు కట్ట భరణి శంకర్ రెడ్డిని నియోజకవర్గ వైసిపి రైతు విభాగం అధ్యక్షులుగా నియమించారు. రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పనిచేస్తున్న ఈదా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా, నాయుడుపేట మండలం యువజన విభాగం అధ్యక్షులుగా ఉన్న కౌన్సిలర్ పాలేటి నాగార్జునను నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షునిగా, కౌన్సిలర్ ఎస్.కె షబ్బీర్‌ని మైనార్టీ సెల్ అధ్యక్షునిగా పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు అందుకున్న నాయకులు పార్టీ అధిష్టానానికి, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

మేకపాటి గౌతమ్ రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - నాయుడుపేట: శుక్రవారం నెల్లూరులోని మేకపాటి రాజమోహన్ రెడ్డి నివాసంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తృతీయ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరై గౌతంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయుడుపేట మండల పార్టీ అధ్యక్షులు ఓజ్యూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట కౌన్సిలర్ పాలేటి నాగార్జున, ఎస్.కె.షబ్బీర్, వైసీపీ నాయకులు కటకం జయరామయ్య, గండవల్లి సిద్ధయ్యలు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ హాల్ టికెట్లు విడుదల

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ హాల్ టికెట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. విద్యార్థులు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. డౌన్‌లోడ్ చేసుకొనే విధానం: 1) మొదట వాట్సాప్ నెంబర్ 9552300009 కు 'హాయ్' అని మెసేజ్ పెట్టండి. 2) వెంటనే ప్రభుత్వ సర్వీసులు డిస్ ప్లే అవుతాయి. 3) అందులో విద్యాశాఖను ఎంపిక చేసుకోండి. 4) విద్యార్థి ఆధార్ లేదా రోల్ నెంబరును టైప్ చేయండి 5) తరువాత విద్యార్థి పుట్టిన తేదీ, నెల, సంవత్సరం టైప్ చేయండి. 6) కొన్ని సెకన్లలో హాల్ టికెట్ వాట్సాప్‌కు పీడిఎఫ్ ఫార్మెట్‌లో డౌన్ లోడ్ అవుతుంది.

మహిళకు అరుదైన గౌరవం



పూర్ణిమా దేవి బర్మాన్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రముఖ జీవశాస్త్రవేత్త, పర్యావరణ సంరక్షకురాలు పూర్ణిమ దేవి బర్మాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఉమెన్ ఆఫ్ ది ఇయర్ 2025 జాబితా, టైమ్ మ్యాగజైన్‌లో చోటు దక్కించుకున్న భారత్ నుండి ఎన్నికైన ఏకైక మహిళ పూర్ణిమా దేవి బర్మాన్ కావడం విశేషం. వివిధ దేశాలకు చెందిన 13 మందికి ఈ జాబితాలో చోటు దక్కగా, వారిలో కేవలం ఒకే ఒక్క భారతీయ మహిళ ఉంది. ఆమె అస్సాంకు చెందిన భారతీయ జీవన శాస్త్రవేత్త, వన్యప్రాణుల సంరక్షణాధికారి 45 ఏళ్ల పూర్ణిమా దేవి బర్మాన్. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలియచేశారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్యాధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునిల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రాంతీయ ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. కమిటీసభ్యులు, వైద్యాధికారులు తదితరులతో ఆయన వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ మే లోగా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని, వారికి చెల్లించే మొత్తంలో కూడా మతలబు జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ పనుల్లో అవినీతి జరుగుతోందని తన దృష్టికి వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ షరీనా, ఆర్.ఎం.ఓ రవి కుమార్, ఏ.వో కమల కిరణ్, కమిటీ సభ్యులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డీ.ఆర్.డబ్ల్యూ కళాశాలలో ఎపి స్కిల్ డెవలప్ కార్పోరేషన్ అద్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుండి నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి ఇక్కడ జాబ్ మేళా ఏర్పాటు చేశానన్నారు. ఈ జాబ్ మేళాలో 350 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయని తెలిపారు. అనంతరం ఎంపికైన అభ్యర్దులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ అధికారి లోక్ నాధం, నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే సాయం



బాధితులకు ఆర్థిక సాయమందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా): పిచ్చాటూరులో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి శుక్రవారం 25 కిలోల బియ్యం, రూ.7 వేలు ఆర్థిక సాయంను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందించారు. నాలుగు రోజుల క్రితం స్థానిక బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ సమీపంలో ఇంద్ర, కుప్పయ్య దంపతుల పూరిళ్లు అగ్నికి ఆహుతైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం అందించే పక్కా ఇల్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీ ఇలంగోవన్, టీడీపీ నాయకులు పద్దు రాజు, వెంకటరత్నం నాయుడు, భక్తా రెడ్డి, వినాయగం రెడ్డి, చిన్నా, ఆర్ ఐ సుధాకర్, వీఆర్వో సెల్వం తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా..? చెత్త నుంచి సంపద కేంద్రం

కొంతమంది అధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ ఆశయాకు గండి కొడుతోంది. కెవిబి పురం మండలంలో చెత్తనుండి సంపద తయారీ కేంద్రం ఏర్పాటు చేసినా పట్టించుకునే నాధుడు లేక ఫలితం శూన్యమైంది. ఖర్చుపెట్టిన లక్షల రూపాయలు వృధా అయింది. పరిసర గ్రామాలనుండి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తే వారు రీసైకిల్ చేసి పంచాయతీకి ఆదాయ వనరుగా మారుస్తారు. కానీ అది అటకెక్కింది. పారిశుద్ధ్య కార్మికులకు జీతాల్లేక, చెత్త తరలించే వాహనాలు వాడకపోవడంతో అవి మూలన పడ్డాయి. చివరకు షెడ్డు వేసిన కాంట్రాక్టరుకు బిల్లు చెలించకపోవడంతో రేకులు పీక్కుని వెళ్లాడు. చెత్తను రోడ్డు పక్కన పడేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు మారాలని గ్రామస్తులు కోరుతున్నారు.



షెడ్డు రేకులు పీక్కెళ్లిన కాంట్రాక్టర్



మూల వద్ద చెత్త తరలించే వాహనం



రోడ్డు పక్కన చెత్త పడేసిన వైనం

ప్రజాశక్తి - కేవిబి పురం: చెత్త నుండి సంపద సృష్టించి వాటి ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలనే ఆశయంతో గత ప్రభుత్వం గ్రామాల నుండి చెత్త తీసుకొని వెళ్లేందుకు ట్రై సైకిల్స్, ఎలక్ట్రిక్ ట్రాలీ బండ్లు పంచాయితీకి అందించింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో అవి మూలకుచేరి నిరూపయోగంగా మారాయి. మండలంలోని 39 పంచాయతీలోనూ ఉపాధి హామీ పథకం ద్వారా చెత్త సంపద కేంద్రాలు నిర్మించి, వీటి నిర్వహణకు షెడ్ మిత్రులు, క్లాప్ మిత్రులను ప్రభుత్వం నియమించింది. వీరికి స్వచ్ఛ భారత్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. వీరు గ్రామంలోని చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలిస్తారు. కానీ మండలంలోని చాలా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలకు చెత్త చేరవేయడంలేదని స్థానిక నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో 19 సచివాలయాలు ఉన్నాయి. అందులో కొన్ని సచివాలయ పరిధిలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. చెత్త సంపద కేంద్రానికి షెడ్డు వేసిన కాంట్రాక్టరుకు రేకులకు బిల్లు రాకపోవడంతో, అతను రేకులను ఊడపెరిక తీసుకువెళ్లాడు. ఇది సదరు అధికారుల పనితీరును తెలియచేస్తోంది. చెత్త పోయడానికి చోటు లేక రోడ్డు ఇరుపక్కల చెత్త పోయడంతో ఆ రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులకు గుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పారిశుద్ధ్య కార్మికులను అందని జీతాలు

మండలంలోని కలత్తూరు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెండేళ్లగా జీతాలు అందడం లేదు. చివరగా 2022 సంవత్సరంలో అప్పటి వైసిపి ప్రభుత్వం వీరికి జీతాలు అందజేసింది. అప్పటినుండి ఇప్పటివరకు జీతాలు అందజేయలేదు. కార్మికులకు జీతాలు అందచేసి, చెత్త నుండి సంపద కేంద్రాల ఏర్పాటు ఉద్దేశాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదే.

శివరాత్రి ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సదాశివకోన ఆలయ శివరాత్రి ఉత్సవాల గోడపత్రికలను నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివకోన ఆలయ ఈవో, ఆలయ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు ధనుంజయ నాయుడులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రుణాల పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 54 యూనిట్లు మంజూరు కాగా 149 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు సప్తగిరి మేనేజర్ సంగీత లాలుస, ఎస్బిఐ మేనేజర్ విజయ్ కుమార్, వివిధ బ్యాంకు అధికారులు, మండల సూపరింటెండెంట్ వాణి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బిఐ వ్యక్తిగత ప్రమాద బీమాతో భరోసా

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భారతీయ స్టేట్ బ్యాంకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీతో పాలసీదారులకు ప్రమాదం సంభవిస్తే కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందుతుందని తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ స్టేట్ బ్యాంక్ మేనేజర్ మోహన్ నాయక్ తెలియజేశారు. వెయ్యి రూపాయలు ఎస్బిఐ ఇన్సూరెన్స్ ప్రీమియం పాలసీని 2000కు విస్తరించిన నేపథ్యంలో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో బీమా గురించి తెలిపారు. వివరాలకు బ్యాంకు అధికారులను సంప్రదించాలని కోరారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం మండలంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం నాగలాపురం ఈస్ట్ హరిజన వాడకు చేరుకొని రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. వడ్ల కుప్పం గ్రామంలో రూ.13.50 లక్షలతో నూతనంగా నిర్మించిన త్రాగునీటి పైప్ లైన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ప్రేమ సెల్వ కుమార్, సీనియర్ నాయకులు సుబ్రమణ్యం రాజు, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీ మురళి, పార్థిబన్, వెంకటేష్, మహేష్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నం వాసుదేవ నాయుడు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా తొట్టంబేడు మండలానికి చెందిన ఉన్నం వాసుదేవనాయుడు నియమితులయ్యారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం నియామక పత్రాన్ని విడుదల చేశారు. తొట్టంబేడు మండల వైసిపి అధ్యక్షులుగా ఉన్న వాసుదేవ నాయుడు ఆ పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేశారు. ఆయన పనితీరును నచ్చిన జగన్మోహన్ రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో వైసిపి గెలుపుకు తన వంతు కీలక పాత్ర పోషిస్తానని వాసుదేవ నాయుడు అన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఎంపిక



ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో వర్శిటీ అధికారులు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తమిళ నాడు, నాగర్ కోయిల్‌లో 22 నుంచి 28 వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో పరిధిలో ఉన్న ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుంచి ఐదు మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను ఉద్దేశించి వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల, సంస్కృతుల మధ్య ఐక్యత, శాంతి, ఆధ్యాత్మిక, సహృద్భావ సామరస్యాన్ని నిర్మించడం ఈ శిబిరాల లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ ఆచార్య దామోదరం, మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఎంపికైన విద్యార్థులు వరుసగా జి.ఆనంద్ (ఎస్వీఆర్ట్స్ తిరుపతి), కిరణ్ కుమార్ (పివికేఎన్ – చిత్తూర్), రూపేష్ (గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, పలమనేరు), సతీష్ (విజ్ఞానాంబిక – మదనపల్లి), వంశీ ప్రసాద్ నాయక్ (గవర్నమెంట్ డిగ్రీ కళాశాల,పీలేరు)లు పాల్గొన్నారు.

టీటీడీ డిప్యూటీ ఈఈకి డాక్టరేట్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టీటీడీ, తిరుమల డిప్యూటీ కార్యనిర్వహణ ఇంజనీర్, రామకోటేశ్వర రావుకు యస్వీయు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. "క్యారెక్టరేట్యజేషన్ ఆఫ్ అల్యూమినియం మెటల్ మ్యాట్రిక్స్ హైబ్రిడ్ కాంపోజిట్స్ అండ్ ఇట్స్ మెషినింగ్ రెస్పాన్స్ ఇన్ సిఎన్ సి డ్రిల్లింగ్" అనే అంశంపై ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యుడు డాక్టర్ వెంకటరామయ్య పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఈ పురస్కారం లభించింది.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు



శ్రీకాళహస్తి డిపో మేనేజరు టి.ముని చంద్రయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీకాళహస్తి డిపో మేనేజరు టి.ముని చంద్రయ్య తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి 40, నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తికి మూడు, చెన్నై నుంచి శ్రీకాళహస్తికి తొమ్మిది, పిచ్చాటూరుకు 10, గుడిమల్లంకు రెండు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మునిచంద్రయ్య తెలిపారు. పల్లె వెలుగు, అల్ట్రా బస్సులు మిగతా బస్సులు ఆర్టీసీ డిపో కి వస్తాయని తెలియజేశారు. ఏపీ సీడ్స్ కూడలి, ఆర్టీసీ బస్టాండు దగ్గర దిగే భక్తుల కోసం ఆలయం వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. భక్తులు ఆర్టీసీ వారికి సహకరించాలని మునిచంద్రయ్య కోరారు. మహాశివరాత్రి, స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం రోజున ప్రతి పది నిమిషాలకు ఒకసారి బస్సు నడపనున్నట్లు మునిచంద్రయ్య తెలిపారు.

కూటమి నేతలకు రాచ మర్యాదలు చేయాలా..?

తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి దేవస్థానంలో దైవ సేవకులుగా ఉన్న టిటిడి ఉద్యోగులు కూటమి నేతలకు రాచ మర్యాదలు చేయాలా అని వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు ఉదయ్ వంశీ ప్రశ్నించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన ధర్మకర్తల మండలి సభ్యుడుగా ఉన్న నరేష్ నిరంతరం స్వామివారి సేవలో భక్తులకు సేవ చేసే టిటిడి ఉద్యోగిని పరుష పదజాలంతో మహాద్వారం వద్ద దూషించడం తప్పిదముగా కూటమి నేతలకు కనబడటం లేదా అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీ ఉద్యోగులను పనిమనుషులుగా చూడడం, వారికి తగిన మర్యాద దక్కకపోతే విధుల నుండి సస్పెండ్ చేయించడం, ట్రాన్స్ఫర్‌లు చేయించడం చేయడం దేనికి సంకేతం అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

గుండె ఆపరేషన్‌కు సాయం చేయండి

రూ.50 వేలు అందించిన సుదర్శన్ ఆటో స్టాండ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) ఆర్థికంగా ఇబ్బందు లను ఎదుర్కొంటూ ఆటో నడుపుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న జీవకోనకు చెందిన మనోజ్ కుమార్ కుమార్తె దీప్తి మాధురికి పుట్టుకతోనే గుండె సంబంధిత సమస్యలు ఎదురయ్యాయి. ఒకటిన్నర సంవత్సరం వయసున్న దీప్తి మాధురికి గుండెలో హోల్స్ ఉన్నాయని వైద్యులు తెలపడంతో ఆపరేషన్ చేయించారు. తరువాత కూడా సమస్య రావడంతో ఆంజియోగ్రామ్ చేసి పాపకు పల్మనరీ వాల్వ్ ఇంప్లాంటేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. అయితే పాపను ఎలాగైనా బ్రతికించుకోవాలని ఉద్దేశంతో ఉన్న ఆస్తులను సైతం అమ్మి పాపకు గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు చేయించారు. ఈ ఆపరేషన్‌కు 18 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలపడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో తిరుపతి రైల్వే స్టేషన్ సుదర్శన్ ఆటో స్టాండ్ వారిని ఆర్థిక సాయాన్ని మనోజ్ కుమార్ అర్థించారు. సమస్య తెలుసుకున్న ఆటో డ్రైవర్లు మానవతా దక్పథంతో స్పందించి రూ.50 వేల రూపాయలను అందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలని కోరారు. ఫోన్ పే 8977765058 కు నగదు బదిలీ సాయాన్ని అందించాలని వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో భాను, ప్రకాష్, పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.




భూముల పరిహారం పెంచాలని ఎంపికి వినతి

ప్రజాశక్తి -ఏర్పేడు :ఏర్పేడు– పూడి రైల్వే బైపాస్ మార్గానికి తీసుకునే భూములకు పరిహారాన్ని ప్రస్తుత మార్కెట్ రేటును బట్టి చెల్లించేలా చూడాలని ఏర్పేడు మండలంలోని ఎండి పుత్తూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎంపీ గురుమూర్తికి విన్నవించారు. పూడి– ఏర్పేడు మధ్య ప్రస్తుతం రైల్వే లైన్ సర్వే పనులు పూర్తయ్యాయి. రెవెన్యూ అధికారులు భూ పరిహారం విషయంలో జిమ్మిక్కులు చేసి పదేళ్ల కిందటి మార్కెట్ రేటును పరిగణలోకి తీసుకొని దానికి మూడింతలు చేయడం వల్ల పరిహారం తక్కువగా వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత మార్కెట్ రేటు ఎకరం కోట్లలో ఉండగా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ రేటు గత పది సంవత్సరాల క్రితం తీసుకొని లెక్కలు వేస్తూ చెల్లిస్తూ ఉండడం పట్ల గతంలో సైతం భూ పరిహారం పొందడంలో రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం రైల్వే లైన్ కు వచ్చే మార్గంలో డీకేటీ భూములు కాకుండా అన్ని మార్కెట్ విలువ కోట్ల లో ఉన్న రిజిస్టర్డ్ భూములు ఉండడం వల్ల రైతులు ఆవేదన చెందుతున్నారు. రైల్వే లైన్ పొలాల్లో రావడం వల్ల పొలాలకు మార్కెట్ విలువ భారీగా పడిపోతుందని రైతులు మదన పడుతున్నారు. దీంతోపాటు రైల్వే లైన్ కి అటువైపు ఉన్న పొలాల వద్దకు వెళ్లేందుకు దారి ఉండకపోవడంతో తమ పొలాల సాగుకు ఇబ్బంది అవుతుందని వారు ఎంపీ దష్టికి తీసుకువచ్చారు. రైతులు అవతలి వైపుకు ట్రాక్టర్లు, ఇతర యంత్రములు, వరి కోత మిషన్లు వెళ్లేందుకు అనువైన మార్గం పెద్ద కల్వర్టులు ఏర్పాటు చేయాలని ఎండి పుత్తూరు కు చెందిన రైతు పురుషోత్తం రెడ్డి ఎంపీకి విన్నవించారు. తమ పొలాల్లో మధ్యన రైల్వే లైన్ రావడం వల్ల పొలాలకు మార్కెట్ ధర తగ్గుతుందని దీన్ని పరిగణలోకి తీసుకొని ప్రస్తుతం ఉన్న మార్కెట్ రేటును బట్టి పరిహారం అందించేలా చూడాలని ఎంపీకి స్థానిక రైతులు విన్నవించారు. ప్రస్తుతం ఎకరా భూమి కోట్లలో ఉండగా రెవెన్యూ అధికారులు మూడింతలు వేసి కూడా లక్షల్లోనే పరిహారం అందిస్తున్నారని గతంలో జరిగిన అనేక భూ పరిహారాల విషయాన్ని బట్టి తాము ఇప్పటినుంచి పొలాలు పోతున్నాయని బాధపడాల్సి వస్తుందని రైతు పురుషోత్తం రెడ్డి ఎంపీ తో ఆవేదన వ్యక్తం చేశారు.

రామగిరి కొండకు నిప్పు .. జీవరాసుల ప్రాణాలకు ముప్పు

- పట్టించుకోని అటవీ అధికారులు





కొండపై అగ్ని కీలలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా) : ప్రకృతిలో భాగంగా కొండలు, వాటిపై అడవులు ఉండడం వల్ల వాతావరణ సమతుల్యత కాపాడబడుతోంది. వర్షాకాలంలో వర్షాలు పడేందుకు కొండలు, అడవులు ఎంతగానో దోహదం చేస్తాయి. అంతేగాక వన్యప్రాణులు, పక్షులకు ఆలవాలంగా నిలుస్తాయి. కానీ కొందని స్వార్థం అటు పర్యావరణానికి, ఇటు జీవరాశులకు ముప్పు తెస్తోంది. కొండలకి నిప్పులు పెట్టడం వలన చెట్లతో పాటు జీవరాసులు మాడి మసైపోతున్నాయి. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అటవీ సంపదను, జీవరాశులను రక్షించుకోవాలని ప్రభుత్వాలు కోట్లు ఖర్చుపెట్టి ఉద్యోగ నియమకాలు చేపట్టినా వారు బాధ్యతా రాహిత్యగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

పిచ్చాటూరు మండలం రామగిరి కొండకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో కొండపై ఉన్న చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. పక్షులు, జీవరాశులు అతలాకుతలమవుతున్నాయి. ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఈ తంతు జరుగుతున్నా దీనిపై అటవీ శాఖ అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయమని గ్రామస్తులు నిరసన తెలుపుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకుని ఈ అగ్ని కీలలను ఆపాలని కోరుతున్నారు.

క్రైం న్యూస్

రైలు ఢీకొని విద్యార్థి మృతి



మృతిచెందిన బాలాజీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైలు కిందపడి విద్యార్థి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు పుత్తూరు రూరల్ మండలం, కేబిఆర్ పురం, అంజూరు గ్రామానికి చెందిన ఎం.బాలాజీ పుత్తూ రు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను బీసీ హాస్టల్లో ఉంటున్నాడు. గురువారం రాత్రి పుత్తూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న బాలాజీని కొల్లం ఎక్స్ప్రెస్ రైలు ఢీ కొట్టడంతో మృతి చెందాడు. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు శవ పరీక్షలు నిమిత్తం మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేస్తున్నారు.

పాఠశాలలో శ్రద్ధాంజలి: విద్యార్థి బాలాజీ మృతికి ఇంచార్జి ప్రిన్సిపాల్ జి కోటేశ్వరయ్య, వి. వీరయ్య, టి నరసింహులు, డాక్టర్ జి. గంగయ్య, డాక్టర్ పి.వెంకటేశన్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు నివాళి అర్పించారు.

చంపి పాతి పెట్టేశారు



పూడ్చిన మృత దేహం.. ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : ఓ వ్యక్తిని చంపి అనుమానం రాకుండా నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో పాతిపెట్టిన సంఘటన శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాజీవ్ నగర్ నుండి నెల్లిమానుకండ్రిగకు వెళ్ళే దారిలో, నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద నుంచి ఇసుక తీసుకను తీసుకెళ్లేందుకు ఇద్దరు మహిళలు వెళ్లారు. ఇసుకను తవ్వుతుండగా మనిషి కాళ్ళు బయటపడడంతో భయంతో పరుగులు తీశారు. సమాచారాన్ని తొట్టంబేడు పోలీసులకు తెలియజేయడంతో ఎస్ఐ ఈశ్వరయ్య తన బృందంతో ఘటనా స్థలికి చేరుకున్నారు. ఇసుకలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం బాగా కుళ్ళిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉండడంతో, నెల రోజుల కిందట ఈ సంఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి సమీపంలోనే పాదరక్షలు, లగేజీ కవర్లు కనపడటంతో డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ తిమ్మయ్య సమక్షంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రుయా బ్లడ్ బ్యాంక్ వెనుక గుర్తుతెలియని మహిళ మృత దేహం పడిఉంది. శుక్రవారం మృత దేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సుమారు 35 సంవత్సరాల వయసు ఉన్న మహిళగా పోలీసులకు భావిస్తున్నారు. మృత దేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే తిరుపతి వెస్ట్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

బైక్ ఢీ.. ఒకరు మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బైక్, ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు బాలాజీ కాలనీ–చంద్రగిరి రహదారిలోని గరుడ ఎంక్లేవ్ అపార్ట్మెంట్ ఎదురుగా హాస్టల్‌కు సరుకులు తీసుకుని బైక్ వెళుతున్న గంగాధరంను ఆటో ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఆటో డ్రైవర్ బైక్‌ను ఢీ కొట్టాడని సమాచారం. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ యశోదకు, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా అతడు మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసినవారు రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జయచంద్ర

ప్రజాశక్తి -ఏర్పేడు : బాల్యవివాహాల నిర్మూలనపై ఏర్పేడు సీఐ జయచంద్ర అధ్యక్షతన ఏఎస్ఐ హబీబుల్లా, ప్రగతి సంస్థ కన్వీనర్ శిరీష తదితరులు బండారుపల్లి హైస్కూల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏఎస్ఐ హబీబుల్లా సూచించారు.

భూ రీ సర్వే పకడ్బందీగా నిర్వహించండి



భూ రీసర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటరమణ

ప్రజాశక్తి - రామచంద్రాపురం: భూ రీ సర్వే కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం సొరకాయల పాళ్యం రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. రైతులకు సంబంధించిన పట్టా భూముల సరిహద్దుల మేరకు సర్వే నిర్వహించబడుతుందన్నారు. సొరకాయల పాళ్యం రెవెన్యూలో 372 ఎకరాలకు గాను 183 ఎకరాలకు రెవెన్యూ అధికారులు రీ సర్వే నిర్వహించడం పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే డిప్యూటీ తహసిల్దార్ అమృత, మండల సర్వేయర్ రమేష్ బాబు, వీఆర్వో ప్రదీప్ నాయుడు, నరసింహులు, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి

ప్రజాశక్తి- ఏర్పేడు : ఏర్పేడు మండలం, ఎండి పుత్తూరుకు చెందిన లీలావతి వయస్సు(76) మృతి చెందినారు. ఆమె మృతి పట్ల శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎంపీ మద్దెల గురుమూర్తి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కామధేను వాహనంపై కైలాసనాథుని కటాక్షం



ప్రజాశక్తి- నాగలాపురం: సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం ఉదయం నుండి ప్రత్యే పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు కామధేను వాహనంపై స్వామిని ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ లత, దండపాణి, పరంధామ రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

మహిళా వర్సిటీలో జాతీయ సాంకేతిక ఉత్సవం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం "విద్యుత్సావ్ 2కె25" ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లికార్జున, ప్రొఫెసర్ వీసి.వీరారెడ్డి, డాక్టర్ డి. హిమబిందు, ఫ్యాకల్టీ కన్వీనర్ కె. షాలిని, ఫ్యాకల్టీ కో-కన్వీనర్ పొద్దివ సాయిశ్రీ స్టూడెంట్ కన్వీనర్ బి.రమ్య, స్టూడెంట్ కో-కన్వీనర్ ఈ.సాయిపూజిత, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ఎంజీఎంకు ఈఎస్ఐ అనుమతి ఇవ్వండి



రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక ఎంజీఎం ఆస్పత్రికి ఈఎస్ఐ అనుమతినివ్వాలని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రిని విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసిన మయూర్ ఎంజీఎంకు ఈఎస్ఐ అనుమతి ఎందుకు అవసరమో వివరించారు. స్పందించిన మంత్రి తప్పకుండా అనుమతులు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.

విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడండి : ఎస్ఎఫ్ఐ



ఆచార్య మధుమూర్తికి ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాలని, రాష్ట్రస్థాయి ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించడం మానుకొని, రద్దుచేసి ఆయా సంబంధిత యూనివర్సిటీలకి ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష నిర్వాహణ బాధ్యతలు, అనుమతులు ఇవ్వాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నేతలు శుక్రవారం ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, తిరుపతి జిల్లా కార్యదర్శి భగత్ రవిలు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-కోట: మండల పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మాతృ భాషా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి దారా మస్తానయ్య హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ మాతృభాష ఏదైనా అది తల్లితో సమానమని మనం తల్లికి ఎంత గౌరవం ఇస్తామో మాతృభాషకు కూడా అంతే గౌరవం ఇవ్వాలని అన్నారు. తెలుగువాడిగా పుట్టినందుకు గర్వపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి రుణాలు మాఫీ చేయండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఎస్ సి కార్పొరేషన్ ద్వారా గతంలో ఇచ్చిన రుణాలను మాఫీ చేయాలని అంబేద్కర్ భవన్ చైర్మన్ పరమశివాన్ ఆధ్వర్యంలో ఎస్ సి నాయకులు కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్‌కు విన్నవించారు. ఏ.పి. రాష్ట్ర యస్సి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ చిత్తూర్ జిల్లా పర్యటనలో భాగంలో తిరుపతికి విచ్చేసిన సందర్భంగా అంబేద్కర్ భవనం చైర్మన్ డాక్టర్ పి. పరమశివన్, యస్సి నాయకులు, లోన్లు తీసుకున్న లబ్దిదారులు శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. పరమశివన్, సభ్యులు పి. ఇంద్రముని, పుష్పరాజ్, ఆర్.పి.ఐ. అంజయ్య, డాక్టర్ జి. ధనశేఖర్, ఇ.గోపి, ఎస్.కుమార్, ఎం.ప్రభు, పి. ప్రభాకర్, పి. మునివాసు, పి. గిరి, కే.రాజేష్, లబ్ది దారులు తదితరులు పాల్గొన్నారు.



ఏ.పి. రాష్ట్ర యస్సి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

గెలుపు, ఓటమిలను హుందాగా తీసుకోవాలి

ప్రజాశక - చంద్రగిరి: క్రీడాకారులు క్రీడలలో గెలుపు ఓటమిలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నాని హాజరయ్యారు. ఎమ్మెల్యే నాని, డాలర్స్ గ్రూప్ చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ చైర్మన్ పడిగల సురేష్ బాబు, ఎడి ఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్, రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రంభా ప్రసాద్, ఆంధ్ర ప్రదేశ్ ఫ్లోర్ బాల్ సెక్రటరీ కే.జే జోసెఫ్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా రాణిస్తూ ఉన్న టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారుడు ధన శేఖర్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, మహిళలు, ఇతరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నాని, డాలర్స్ దివాకర్ రెడ్డి

కల్పవృక్ష, సర్వభూపాల వాహనలపై శ్రీ కళ్యాణ వెంకన్న వైభవం





ప్రజాశక్తి - చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు శ్రీ రాజగోపాలస్వామివారి అలంకారంలో చంద్రకోలు, దండం ధరించి కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనంపై బకాసుర వధ అలంకారంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

క్లినికల్ ట్రైల్స్‌తో జీవన నాణ్యతను మెరుగుపరచవచ్చు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కవిత

ప్రజాశక్తి - తిరుపతి : దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి జీవన నాణ్యతను క్లినికల్ ట్రైల్స్ ద్వారా మెరుగుపరచవచ్చని ఎస్ఆర్ఎం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఫార్మసీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత తెలిపారు. వెంకటరామాపురంలో శుక్రవా రం నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి పలువురు ప్రతినిధులు సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బిజెపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: భాకరాపేట, ముత్యాలమ్మ గుడి సమావేశ మందిరంలో బీజేపీని మండల స్థాయిలో బలోపేతం చేసే కృషిలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో ఈరోజు ఉదయం ఆత్మీయ సమావేశం జరుగనుంది. ఈసమావేశంలో మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశానికి బిజెపి కార్యకర్తలందరూ హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

సంస్కృత విశ్వవిద్యాలయంలో రోడ్డు సేఫ్టీ క్యాంపెయిన్



జెండా ఊపి క్యాంపెయిన్ ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్-2,3 ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుభద్రతా విషయాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని విసి ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంతశుక్ల, రిజిస్ట్రార్, కెవి.నారాయణరావు, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొ.సత్యనారాయణాచార్య, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డా.ఎ.చందూలాల్, తిరుపతి ట్రాఫిక్ సి.ఐ, ఇతర సిబ్బంది, కో-ఆర్డినేటర్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డా.కనపాల కుమార్, అడిషనల్ కో-ఆర్డినేటర్లా డా.ఎమ్.మేరీ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు నమోదు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - రామచంద్రపురం: జిల్లాలోని రైతులందరికీ విశిష్ట గుర్తింపు కార్డుతోనే రైతు సంక్షేమ పథకాలు పంపిణీ జరుగుతుందని, ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఎన్ ఆర్ కమ్మపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రైతు డిజిటల్ గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం షణ్ముగం, వ్యవసాయ శాఖ సచివాలయ అసిస్టెంట్లు కార్తీక్, ఢిల్లీ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా 'తిరుత్సవ్'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక తిరుపతి ఐఐటీలో టెక్నో-కల్చరల్ ఫెస్ట్(తిరుత్సవ్) శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేలా తిరుత్సవ్ సాగింది. ఇంటరాక్టివ్ త్రీడీ మ్యాప్‌తో ఇంజినీరింగ్ విద్యార్థులు అందర్నీ ఆశ్చర్యపరిచారు. కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు విద్యార్థులు నాంది పలకాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు.

ముక్కంటి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తకన్నప్పకు తొలిపూజతో బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.బాపిరెడ్డి, టీడీపీ నేతలు రంగినేని చెంచయ్యనాయుడు, విజయకుమార్, పలువురు ప్రముఖులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భక్త కన్నప్ప పురవిహారం

భక్తకన్నప్ప కొండపై ఉన్న ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం పూర్తయిన తరువాత స్వామివారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. చతుర్మాడవీధుల్లో ఊరేగుతున్న భక్తకన్నప్పను పలువురు భక్తులు దర్శించుకున్నారు.

ఎన్ఐసి క్యాంపునకు మహిళా వర్సిటీ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : కన్యాకుమారిలోని వివేకానంద కాలేజ్ వేదికగా ఈ నెల 22 నుండి 28 వరకు జరగనున్న నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు పాల్గొననున్నారు. క్యాంపుకు ఎన్నికైన విద్యార్థినులు కె. లిఖిత కామాక్షి, జి.వాణి, జె.పావని, ఎమ్. శైలజ, ఎమ్ రేణుశ్రీ. ఏపీ కంటిన్జెంట్ లీడర్ గా వెళ్తున్న డా.డి.యువశ్రీ, విద్యార్థులను వీసీ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజిని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యావతి అభినందించారు.

శ్రీవారి మెట్టు మార్గంలో భక్తుడికి అస్వస్థత

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం నుండి శ్రీవారి మెట్టు నడక మార్గం నుండి తిరుమల దర్శనానికి వెళ్తున్న భక్తుడు 1150 మెట్ల వద్ద ఫిట్స్‌తో జైపాల్ నల్గొండ వాసి అనారోగ్యానికి గురి అయ్యాడు. వెటనే విజిలెన్స్ అధికారులు108 అంబులెన్స్ ద్వారా తిరుపతి స్విమ్స్ హాస్పిటల్ కి తీసుకెళ్లి చికిత్స అందించారు.

సబ్సిడీ లోన్స్ కోసం దరఖాస్తులు చేసుకోండి

ప్రజాశక్తి - చంద్రగిరి: మైనారిటీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లకు ఎపిఒబిఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగిరి మండలానికి సంబంధించి 23 యూనిట్లు మంజూరు చేశారని తెలిపారు.